చివరిలో సాగునీటి కష్టాలు

- గ్రామాల్లో ఇంకా కోతకు చేరుకోని పొలాలు
- నాలుగు రోజుల్లో నిలిచిపోనున్న కాలువ నీరు
- రైతుల్లో ఆందోళన


కాజులూరులో లేతగా ఉన్న వరిచేను

కాజులూరు: ఈ ఏడాది దాళ్వా తొలిదశ నుంచి సాగునీటి ఎద్దడితో రామచంద్రపురం నియోజకవర్గ గ్రామాల్లోని రైతులు ఇబ్బందులను ఎదుర్కొంటూనే ఉన్నారు. నియోజకవర్గంలోని వరి పొలాలు తూర్పు డెల్టా కాలువ శివారు భూముల్లో ఉండటంతో ఆది నుంచి రైతులకు కష్టాలు తప్పలేదు. ప్రధాన కాలువల నుంచి వచ్చే అరకొర నీటిచుక్కలను వంతుల వారీ విధానంతో పొదుపుగా వాడుకుని వరిసాగు చివరిదశకు తీసుకువచ్చారు. ప్రస్తుతం పంట గింజ గట్టిపడే దశ నుంచి పక్వానికి దగ్గర దశలో ఉంది. ఈ పరిస్థితులలో మరో నాలుగు రోజుల్లో గోదావరి డెల్టా కాలువలకు సాగునీరు నిలుపుదల చేస్తామంటూ నీటిపారులదల శాఖ అధికారులు ప్రకటన విడుదల చేస్తుండటంతో రైతులు ఆందోళనలకు గురౌతున్నారు. వాస్తవానికి నియోజకవర్గ గ్రామాల్లో అత్యధిక శాతం వరి పొలాలు నేటికీ ఈనిక దశలోనే ఉన్నాయి. ఈ పరిస్థితులలో లేత పొలాలకు నీరందే పరిస్థితి లేకపోవటంతో రైతులు దిగాలు చెందుతున్నారు. గత తొలకరి చివరి దశలో కురిసిన చెదురుమదురు వర్షాల కారణంగా మాసూళ్ల నిర్వహణకు తీవ్ర ఆలస్యమయింది. దీనికి తోడు దాళ్వా నారుమడుల సమయంలోనూ భారీవర్షాలు కురవడంతో నారు చనిపోయి కొందరు రైతులు రెండేసి మార్లు నారుమడులు చల్లుకోవలసి వచ్చింది. దీంతో నారు, నాట్లు వేయడంలో పొలానికి, పొలానికి మధ్య వ్యత్యాసం ఏర్పడి ప్రస్తుతం కొన్ని పొలాల్లో పంటకోత ఆలస్యమౌతుందని రైతులు చెబుతున్నారు. పంట తొలిదశ నుంచి కాలువల ద్వారా సాగునీరు సక్రమంగా రాకపోయినప్పటికీ అడపాదడపా వచ్చిన ఊటనీటినే పొలాలకు మళ్లించి ఇబ్బందులు అధిగమించామని కాలువలు నిలుపుదల చేస్తే ఇక పొలాలకు సాగునీరందే పరిస్థితి లేదని రైతులు అంటున్నారు. నియోజకవర్గ గ్రామాల్లో అధిక శాతం పొలాలు కోత దశకు చేరుకునేందుకు సుమారు మరో 15 రోజుల సమయం పడుతుందని చివరి దశలో సాగు నీరందకపోతే గింజ గట్టిపడక దిగుబడి తగ్గిపోతుందని రైతులు వాపోతున్నారు.

అపరాలకు అవకాశం కోల్పోవాలి

తూర్పు డెల్టా కాలువ శివారు భూముల్లో రైతులు దాళ్వా సాగు అనంతరం మూడో పంటగా పెసర, మినుము తదితర అపరాల సాగు చేపడుతుంటారు. ఇందుకోసం వరి కోతకు వారం ముందు పొలానికి పూర్తిగా నీటితడి ఇచ్చి నేల తడిపొడిగా ఉన్న సమయంలో అపరాల విత్తనాలు చల్లి మూడురోజుల తర్వాత వరి కోత కోస్తారు. అయితే ఇప్పుడు కాలువలు నిలుపుదల చేస్తే వరి పంటకే ముప్పు వాటిల్లుతుండగా పొలాల్లో మూడో పంట అయిన అపరాల సాగుకు ఇక అవకాశం లేనట్టేనని రైతులు చెబుతున్నారు. భూసారం పెంచుకునేందుకు రైతులు అపరాలు, పచ్చిరొట్ట పైర్లు చల్లుకోవాలని వ్యవసాయాధికారులు విత్తనాలు సబ్సిడీపై ఇస్తున్నారని అయితే నీటిపారుదల అధికారులు కాలువలు నిలుపుదల చేస్తే ఇక అపరాలు ఎలా సాగు చేయాలని రైతులు ప్రశ్నిస్తున్నారు.

పంటకు నష్టం తప్పదు



వరి మొక్క పూర్తిగా నీటి ఆధారితంగా పెరిగే మొక్క. చివరి దశలో నీటి తడులు అందకపోతే గింజ గట్టిపడక దిగుబడి కోల్పోవలసి వస్తుంది. గింజ నాణ్యత తగ్గిపోతుంది. అపరాల సాగుకైతే అవకాశం లేనట్టే

– వల్లెం వీవీ సత్యనారాయణ, రైతు, ఆర్యావటం

కాలువ నీరు విడుదల సమయాన్ని పొడిగించాలి



కాలువ శివారు భూముల్లోని రైతులు ఇబ్బందులను గమనించి ఇరిగేషన్ అధికారులు కాలువ నీరు విడుదల సమయాన్ని పొడిగించాలి. చివరి దశలో పొలానికి నీటి తడులు ఇవ్వకపోతే వరి మొక్క చనిపోవడమే కాకుండా దిగుబడి తగ్గిపోతుంది.

– గెద్దాడ శ్రీనివాసు, రైతు, మతుకుమిల్లి

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే వేడుకలు

- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు
- గ్రామాల్లో ఏసు సిలువతో ర్యాలీలు


కపిలేశ్వరపురంలో ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

రాయవరం: మండలవ్యాప్తంగా శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా జరిగాయి. రాయవరం, లొల్ల, వెదురుపాక, మాచవరం, నదురుబాద, వి.సావరం, పసలపూడి, చెల్లూరు, వెంటూరు, కూర్మాపురం, కురకాళ్లపల్లి, సోమేశ్వరం గ్రామాల్లోని పలు చర్చిల్లో క్రైస్తవ సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉదయం నుంచి ఉపవాస దీక్షలో ఉన్న భక్తులు ఏసుక్రీస్తును ఆరాధించి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా చర్చిల్లో పాస్టర్లు ఏసుక్రీస్తు చూపిన బాటలో పయనించాలన్నారు. లోక రక్షకుడైన ఏసుక్రీస్తు ప్రపంచ మానవాళికి ప్రేమ, శాంతిని అందించారన్నారు. పలు చర్చిలలో ఏసుక్రీస్తును ఆరాధిస్తూ ప్రత్యేక గీతాలను ఆలపించారు.

కపిలేశ్వరపురం: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం గుడ్ ఫ్రైడే సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. కపిలేశ్వరపురం, అంగర, పడమర ఖండ్రిక, వెదురుమూడి, వల్లూరు, నేలటూరు, నిడసనమెట్ట, వడ్లమూరు, అచ్యుతాపురం, కాలేరు, నల్లూరు, మాచర, టేకి, కోరుమిల్లి, నాగులచెరువులు, వాకతిప్ప, అద్దంకివారిలంక, కేదారిలంక గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గ్రామాల్లో భక్తి శ్రద్ధలతో ర్యాలీ నిర్వహించారు. ఏసును సిలువ వేసిన ఘటనలతో కళా ప్రదర్శనలిచ్చారు.

త్యాగానికి ప్రతీక గుడ్ ఫ్రైడే

రామచంద్రపురం రూరల్: మండలంలోని తోటపేట కతోలిక జయజేసు చర్చి ఫాదర్లు జోసెఫ్ ప్రభాకర్, విమల్‌రాజ్‌ల ఆధ్వర్యంలో సుమారు 2 వేల మంది క్రైస్తవులు తిర్లంపేటలోని చర్చి నుంచి తోటపేట చర్చి వరకు శిలువ యాత్ర నిర్వహించారు. చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వెల్లలో ఏసు మహిమాలయ బాప్టిస్టు చర్చిలో పాస్టర్లు రెవరెండ్ కె.శామ్యూల్‌ప్రసాద్, రెవరెండ్ కె.భాయ్‌ల ఆధ్వర్యంలో క్రీస్తు సందేశం అందజేశారు. అధిక సంఖ్యలో విశ్వాసులు, యువజనులు పాల్గొన్నారు. ద్రాక్షారామలో గుడ్‌న్యూస్ మినిస్ట్రీస్ చర్చిలో డాక్టర్ రెవరెండ్ జాన్ బెన్నీ ఆధ్వర్యంలో ఉపవాస ప్రార్థనలు నిర్వహించారు.

రామచంద్రపురంలో..

రామచంద్రపురం: నియోజకవర్గంలో క్రైస్తవులు గుడ్ ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. క్రైస్తవ ఆలయాల్లో శుక్రవారం ఉదయం నుంచి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పట్టణంలోని రెవరెండ్ ఫాదర్ అంతయ్య ఆధ్వర్యంలో లారీ యూనియన్ ఆఫీసు నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న రోమన్ క్యాథలిక్ దివ్య కారుణ్య దేవాలయం వరకు ఏసు క్రీస్తు శిలువ త్యాగాలను స్మరిస్తూ గుడ్‌ఫ్రైడే శిలువ ర్యాలీ నిర్వహించారు. రెవరెండ్ ఫాదర్ ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ విశ్వశాంతి కోసం ఏసుక్రీస్తు చేసిన త్యాగాలకు ప్రతీక గుడ్‌ఫ్రైడే శిలువ ధ్యాన ప్రార్థనలన్నారు. 2025 ఏళ్ల క్రితం ప్రభువు సమస్త మానవాళి పాప పరిహారం కోసం సిలువలో శ్రమలు పడి రక్తం చిందించి మరణించిన పవిత్ర రోజు శుభశుక్రవారమని గుడ్ ఫ్రైడే సందేశాన్ని తెలియజేశారు. శాంతి సమాజం కోసం ప్రతి ఒక్కరూ శాంతి సమాధానాలో ఉంటూ ప్రేమపూర్వక సమాజం స్థాపించాలని ప్రార్థనలు సందేశాన్నిచ్చారు. గుడ్ ఫ్రైడే శిలువ ధ్యాన శాంతి ర్యాలీ నిర్వహించేందుకు సహకరించిన డీఎస్పీ రఘువీర్, సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ నాగేశ్వరరావు పోలీస్ సిబ్బందికి ఫాదర్ అంతయ్య, ఫాదర్ ప్రేమ్ కుమార్, క్రైస్తవులు ధన్యవాదాలు తెలిపారు.


కుర్మాపురంలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు


తోటపేట కతోలిక జయజేసు చర్చి ఆవరణలో ప్రార్థనల్లో పాల్గొన్న విశ్వాసులు


గుడ్ ఫ్రైడే సిలువ ర్యాలీని నిర్వహిస్తున్న ఫాదర్ అంతయ్య తదితరులు

ధనమ్మ మర్రికి దారెలా..!

- శిథిలావస్థలో బోడిపాలెం వంతెన
- తగ్గుతున్న ఊడల విస్తీర్ణం
- మర్రి చెట్టు మొదళ్ల వద్ద వంటా వార్పుతో సమస్య
- చర్యలు తీసుకోవాలని కోరుతున్న పర్యాటకులు


మర్రి చెట్టు మొదలులో ఇటుకల పొయ్యి, బూడిద ఉన్న దృశ్యం


శిథిల స్థితిలో ఉన్న బోడిపాలెం వంతెన

కపిలేశ్వరపురం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రముఖ, ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతంగా వెలుగొందుతున్న ధనమ్మ మర్రికి వేసవిలో భక్తుల తాకిడి పెరుగుతోంది. కపిలేశ్వరపురం మండలం కేదారిలంక గ్రామ శివారు వీధి వారిలంకలో గోదావరి తీరాన కొలువైన అమ్మవారి ఆలయానికి భక్తులు, పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలివస్తుంటారు. కొత్తపేట సమీపాన బ్రిటీషు కాలంలో నిర్మితమైన ఈ ఆలయానికి వెళ్లాలంటే బోడిపాలెం వంతెనపై నుంచి చేరుకోవాల్సి ఉంది. ఈ వంతెన శిథిలమైన ప్రమాదకరంగా మారింది. ఆలయ ఆవరణలో విశాలమైన మర్రి ఊడలు విస్తీర్ణం రాను రాను తగ్గిపోతోంది. ఆహ్లాదకరమైన ధనమ్మ మర్రి వాతావరణాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పర్యాటకులు చెబుతున్నారు.

ధనమ్మ మర్రి ప్రాశస్త్యం ఇదీ...

తీవ్ర కరువు కాటకాలు ఉన్న రోజుల్లో సమీప గ్రామాల ప్రజలను ధనమ్మతల్లి ఆదుకోవడం, అమ్మవారి అక్కచెల్లెళ్లు మర్రి ఊడల నడుమ నడియాడారన్న నేపథ్యంలో ఈ ప్రాంతాన్ని ధనమ్మ మర్రిగా పిలుస్తారు. సుమారు రెండున్నర ఎకరాల గోదావరి లంక భూమిలో అమ్మ క్షేత్రం వెలసింది. సమీపాన గలగలపారే గౌతమి గోదావరి, చుట్టూరా ఉద్యాన పంటల సాగు, లంక వాసుల జీవన గమనం ఇలా ధనమ్మ మర్రికి అనేక ప్రత్యేకతలున్నాయి. పెళ్లి అయిన తొలిరోజు దంపతులు అమ్మవారిని దర్శించుకోవడం ఆచారం. లంక గ్రామాల ప్రజలు తమ ఉద్యాన పంటల దిగుబడి తొలి పంటను అమ్మవారికి సమర్పించుకుంటారు. వ్యాపార రంగంలోకి ప్రవేశించిన వారు ముందుకుగా అమ్మవారిని దర్శించుకుంటారు. మహిళలు కొనుక్కున్న బంగారు ఆభరణాలను అమ్మవారి మెడలో వేసి పూజలు చేసి తర్వాత వారు వేసుకుంటారు. ఇక్కడ పిల్లల బారసాలలు జరిపి, పేర్లు పెట్టించుకుంటుంటారు. సంతానలేమి దంపతులు ఆలయ ప్రాంగణంలో ఉయ్యాలను ఊపి, ముడుపులను మర్రి చెట్టుకు కట్టి మొక్కుకుంటారు.

తరిగిపోతున్న మర్రి ఊడలు

ఆది నుంచి నేటి వరకూ ప్రైవేటు ఏలుబడిలో ఆలయ నిర్వహణ కొనసాగుతోంది. ఆది, మంగళ, బుధవారాల్లో భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తుంటారు. భక్తుల సంఖ్య పెరుగుతున్న కొలదీ ఏర్పాట్లు చేయడం, తగిన సదుపాయాలను కల్పించడంలో కృషి సమర్థవంతంగానే ఉంది. అయితే కాలం చెల్లడంతో కొన్ని మర్రిచెట్లు బురుగుపోయే దశకు చేరుకున్నాయి. క్షేత్రం ఆవరణలో మానవ తాకిడి పెరగడంతో నేల గట్టిపడి మర్రి ఊడలు భూమిలోకి చొచ్చుకొనివెళ్లే పరిస్థితులు ఏర్పడ్డాయి. దీనికితోడు భక్తులు మర్రి ఊడల వంటలు చేయడంతో చెట్టు మొదలు ప్రాంతంలోని బెరడు దెబ్బతింటోంది. ఈ పరిస్థితి దీర్ఘకాలం పాటు కొనసాగడంతో ఇప్పటికే మర్రి ఊడలు చాలా వరకూ తగ్గిపోయాయి. వంటలు చేసుకునేందుకు షెడ్లు ఏర్పాటు చేస్తే బాగుంటుందని భక్తులు కోరుతున్నారు.

బోడిపాలెం వంతెన పరిస్థితి ఇలా,..

కొత్తపేట ఆర్‌అండ్‌బీ రహదారిని ఆనుకుని ఉన్న ఈ వంతెన సుమారు 70 ఏళ్ల క్రితం నిర్మించారు. కపిలేశ్వరపురం మండలంలోని కేదారిలంక, వీధి వారిలంక, నారాయణలంక గ్రామాలను సమీప కొత్తపేట మండలంలోని కొత్తపేట వాడపాలెంలను ఈ వంతెన అనుసంధానం చేస్తుంది. బ్రిటీషు కాలం నాటిది కావడంతో వంతెన శిథిలస్థితిలో ఉంది. దీనికి తోడు ప్రస్తుత అవసరాలకు ఏ మాత్రం అనువుగా లేకుండా ఇరుకుగా కూడా ఉంది.

ఇనుప వంతెన కావడంతో ఇనుము భాగాలు తుప్పుపట్టి ఊడిపోతున్నాయి. రేకులు పైకి లేచి ప్రమాదకరంగా మారాయి. లంక గ్రామాల్లోని వ్యవసాయ ఉత్పత్తులను, ఇసుక, మట్టి, ఇటుకలను ఇతర ప్రాంతాలకు ఈ వంతెన మీదుగానే తరలిస్తుంటారు. కేదారిలంక, నారాయణలంకల్లోని ఇసుక ర్యాంపుల నుంచి వాహనాలు ఈ వంతెన మీదుగా వెళ్తున్నాయి. వంతెన రక్షణ గోడలు తరచూ ఊడిపడినప్పుడల్లా తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నారు. కార్తికమాసంలో వందలాది వాహనాలు ఈ వంతెన మీదుగా ధనమ్మ మర్రికి చేరుకుంటాయి. ఇంతటి ప్రాధాన్యత ఉన్న నేపథ్యంలో కొత్త వంతెనను నిర్మించాలని లంక గ్రామల ప్రజలు, భక్తులు, పర్యాటకులు కోరుతున్నారు.

క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు సిద్ధం


కాజులూరులో ఎంపీడీఓ రాంబాబుకు సమ్మె నోటీసు అందజేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

కాజులూరు: తమ న్యాయమైన సమస్యలను ప్రభుత్వం సత్వరమే పరిష్కరించాలని కోరుతూ మండల పరిషత్ కార్యాలయం ఎదుట శుక్రవారం ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు ఆందోళనకు దిగారు. ప్లకార్డులతో ప్రదర్శనలు చేస్తూ నినాదాలు చేశారు. సంఘ నాయకుడు కట్టా నాగరాజు, కట్టా లోవరాజు, సత్యనారాయణ, చిన్నారి అప్పారావు, లక్ష్మీ తదితరులు మాట్లాడుతూ తమ డిమాండ్ల పరిష్కారం కోసం గత కొద్దిరోజులుగా ఆందోళనలు చేపడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. దీనిపై శుక్రవారం పెన్ డౌన్ నిర్వహించి నిరసన కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకుంటే ఈ నెల 28 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామన్నారు. సమ్మె నోటీసును ఎంపీడీఓ రాంబాబుకు అందజేశారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించుకోవాలి


చేదువాడలో ధాన్యం విక్రయాలపై రైతులకు సూచనలిస్తున్న ఏవో అశోక్

కాజులూరు: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం విక్రయించుకోవాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. శుక్రవారం మండలంలోని చేదువాడ, కాజులూరు, తిప్పరాజుపాలెం, దుగ్గుదుర్రు తదితర గ్రామాల్లో ఏఓ పర్యటించి రైతులు నిర్వహిస్తున్న పంట మాసూళ్లను పరిశీలించారు. చేదువాడలో ఆయన మాట్లాడుతూ మండలంలో 21 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. కనీస మద్దతు ధర 75 కేజీలు బస్తాకు ప్రభుత్వం రూ.1725 చెల్లిస్తుందన్నారు. బయట మార్కెట్‌లో తక్కువ ధర చెల్లిస్తున్నారని రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. గ్రామాల్లో వీఏఏలు, అధికారులు రైతులకు అవగాహన కల్పించి కొనుగోలు వేగవంతం చేయాలన్నారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు


నిందితుడు, స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో రూరల్ సీఐ దొరరాజు

మండపేట: యానాం నుంచి మద్యం తరలిస్తున్న వ్యక్తిని రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మండలంలోని జెడ్.మేడపాడు వంతెన వద్ద గురువారం రాత్రి సీఐ దొరరాజు నేతృత్వంలో ఎస్ఐ పి.బుజ్జిబాబు సిబ్బందితో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. దివాన్ చెరువుకు చెందిన జుత్తుక అజయ్‌సింగ్ యానాం నుంచి కారులో 10 బీర్లు, 3 ఫుల్ బాటిల్స్ పట్టుకొస్తుండగా అతనిని అదుపులోకి తీసుకున్నట్టు దొరరాజు తెలిపారు. మొత్తం 109 వాహనాలు ఆపి తనిఖీలు నిర్వహించగా మద్యం సేవించి వాహనాలు నడిపిన ఏడుగురిపై కేసు నమోదు చేశామన్నారు.

కళాకారుడికి డాక్టరేట్


డాక్టరేట్ అందుకుంటున్న కళాకారుడు సత్యనారాయణ

మామిడికుదురు: నగరం గ్రామానికి చెందిన ప్రముఖ బుర్రకథ కళాకారుడు మంగం సత్యనారాయణ గౌరవ డాక్టరేట్ అవార్డు అందుకున్నారు. హైదరాబాదులోని డాక్టర్ ఎన్టీ రామారావు కళా మందిర్‌లో గురువారం జరిగిన సమావేశంలో శ్రీపొట్టి శ్రీరాములు యూనివర్సిటీ ప్రతిష్టాత్మక డాక్టరేట్ అవార్డుతో సత్యనారాయణను సన్మానించింది. ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. గౌరవ డాక్టరేట్ అవార్డు అందుకున్న సత్యనారాయణను శుక్రవారం నగరంలో పలువురు అభినందించారు. అతడికి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలి

అంబాజీపేట: ఎస్సీ కార్పొరేషన్ కార్యాచరణ ప్రణాళిక 2024–25 సంవత్సరానికి మండల పరిషత్ ద్వారా అందించే రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. ఓబీఎంఎంఎస్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 21 నుంచి 50 ఏళ్ల లోపు వారు అర్హులన్నారు. మే 10 లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఆధార్‌కార్డుకు లింకైన ఫోన్ నంబర్, రేషన్ కార్డు, కులం, ఆదాయ ధ్రువపత్రం, రవాణాకు సంబంధించిన డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలన్నారు, ఆధార్, రేషన్ కార్డులతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలన్నారు.

ఎమ్మెల్సీ తోటకు శుభాకాంక్షలు


ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులును సత్కరిస్తున్న అలీఖాన్‌బాబా

మండపేట: వైఎస్సార్ సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా నియమితులైన ఆ పార్టీ మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు షేక్ అండ్ షేక్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్ అలీఖాన్‌బాబా శుభాకాంక్షలు తెలిపారు. విజయలక్ష్మి నగర్‌లోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. తోట నియామకం మండపేట నియోజకవర్గ కార్యకర్తలకు, నాయకులకు తీపి కబురు అని అన్నారు. తోట త్రిమూర్తులు నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. అలాగే పార్టీ రూరల్ కన్వీనర్ పిల్లా వీరబాబు తోటను మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

సర్వే త్వరితగతిన పూర్తి చేయాలి


వైస్ ఎంపీపీ నాగబాబు

మండపేట: నియోజకవర్గంలో చేపట్టిన స్వామిత్వ సర్వేను త్వరితగతిన పూర్తి చేసి కార్డులు ఇవ్వాలని వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగేశ్వరరావు (నాగబాబు) కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో మొదలు పెట్టిన స్వామిత్వ సర్వే ఇంకా పూర్తి కాలేదన్నారు. సర్వేను త్వరగా పూర్తిచేసి సంబంధిత కార్డులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. కొన్ని ప్రాంతాల్లో సర్వే అసంపూర్తిగా జరిగిందని విమర్శించారు. ప్రజలు పూర్వం నుంచి గ్రామకంఠం, ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్నారని, వారికి ఆ భూములపై యాజమాన్య హక్కులు కల్పించాలన్నారు. యాజమాన్య హక్కు లేక బ్యాంకులు, ప్రైవేటు సంస్థల నుంచి రుణాలు తెచ్చుకునేందుకు అవకాశం లేకుండా పోయిందన్నారు. స్వామిత్వ ద్వారా వారికి హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే 10 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 65 లక్షల మందికి ఆస్తి కార్డులు పంపిణీ చేశారని ఆయన గుర్తు చేశారు.

రాజధానికి ఉన్న భూములు సరిపోవా ?


కామన ప్రభాకరరావు

మండపేట: రాజధాని అమరావతి నిర్మాణం కోసం ప్రభుత్వం ఇప్పటికే 34 వేల ఎకరాలు తీసుకుందని, ఇప్పుడు మళ్లీ 44 వేల ఎకరాలు తీసుకోవడం దేనికని ఏపీ కిసాన్ కాంగ్రెస్ కమిటీ చైర్మన్ కామన ప్రభాకరరావు సీఎం చంద్రబాబును ప్రశ్నించారు. రాజధాని నిర్మాణం పేరిట రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకోవడానికా ? అని ఎద్దేవా చేశారు. మండపేటలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఎం చంద్రబాబుపై నిప్పులు చెరిగారు. 2700 ఎకరాల్లో సెక్రటేరియట్, హైకోర్టు, అసెంబ్లీ, పరిపాలన కార్యాలయాలన్నీ తాత్కాలికంగా ఏర్పాటు చేశారన్నారు. మిగిలిన భూములన్నీ ఖాళీగా ఉంటే తాజాగా మరో 44 ఎకరాల భూమిని తీసుకుంటామని ప్రభుత్వం ప్రకటించడం ఆశ్చర్యంగా ఉందన్నారు. రాజధాని కోసం ఇప్పటికే రూ.31 వేల కోట్లు అప్పు చేశారని, మరో రూ.69 వేల కోట్లు అవసరం చెబుతున్నారన్నారు. రాష్ట్రాన్ని అథోగతిపాలు చేయడానికి కంకణం కట్టుకున్నారా ? అని ప్రశ్నించారు.

లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలి

అంబాజీపేట: గంగలకుర్రు అగ్రహారం పంచాయతీ పరిధిలోని ప్రసాద్‌నగర్ కాలనీ, గుడాలవారిపాలెంలో తరచూ లోవోల్టేజ్‌తో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తక్షణమే ఆ సమస్యను పరిష్కరించాలని ఆయా కాలనీ వాసులు కోరుతున్నారు. రాత్రి సమయంలో లో వోల్టేజీ కారణంగా విద్యుత్ దీపాలు, ఫ్యానులు సక్రమంగా పనిచేయడం లేదన్నారు. లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలని అధికారులను కోరినప్పటికీ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఘన జీవామృతంతో తెగుళ్లు దూరం


ఘన జీవామృతం తయారీని వివరిస్తున్న ప్రసన్నకుమార్

రాజోలు: ఘన జీవామృతంతో పంటలను ఆశించే తెగుళ్లు దూరమవుతాయని ప్రకృతి వ్యవసాయ తాటిపాక యూనిట్ ఇన్‌చార్జ్ పోతురాజు ప్రసన్నకుమార్ అన్నారు. శుక్రవారం తాటిపాకలో మహిళా రైతులకు ప్రకృతి వ్యవసాయం ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ఘన జీవామృతం తయారు చేసే విధానాన్ని వివరించారు. 500 కేజీల దేశీయ ఆవు పేడ, 20 కేజీల ఆవు మూత్రం, 10 కేజీల శెనగపిండి, 10 కేజీల బెల్లం తీసుకుని వీటన్నిటిని కలియబెట్టి ఒక గోనె సంచిని వారం రోజుల పాటు గాలి తగలకుండా కప్పి ఉంచాలన్నారు. అలా తయారు చేసుకున్న ఘన జీవామృతాన్ని ఎరువుగా వినియోగించుకోవచ్చన్నారు.